# విశాలాంధ్ర గుంటూరు జిల్లా

## టిడ్కో గృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

○ అధికారులను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు శివారులోని వెంగళాయపాలెంలో ఫేజ్ -2 క్రింద నిర్మించాల్సిన 1392 టిడ్కో గృహాలు, తెనాలి పూలే కాలనీలో నిర్మించాల్సిన 1008 టిడ్కో గృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్దిదారులకు స్వాధీనపరచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో టిడ్కో ద్వారా నిర్మిస్తున్న గృహ సముదాయాల స్టేటస్‌పై కలెక్టర్ నాగలక్ష్మీ టిడ్కో అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టిడ్కో పర్యవేక్షక ఇంజనీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు వివరిస్తూ వెంగళాయపాలెం ఫేజ్-1లో నిర్మించిన 1088 గృహాలను లబ్దిదారులకు స్వాధీనపరచడం జరిగిం దని, ఫేజ్-2లోని 1392 గృహాలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. తెనాలిలో ఫేజ్-1లో నిర్మించిన 848 గృహాలను లబ్దిదారులకు స్వాధీనపరచడం జరిగిందని, ఫేజ్-2లో 1008 గృహాల నిర్మాణపనులు వివిధ కారణాలతో ఆగిపోయాయని త్వరలో నిర్మాణపనులు పూర్తి చేసి లబ్దిదారులకు స్వాధీనపరచేం దుకు చర్యలు తీసుకోవడం జరుగుతుం దని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు అడవితక్కెళ్లపాడులో నిర్మించిన 4192 ఇళ్లను, మంగళ గిరిలో 1728, తెనాలిలో 848, పొన్నూరులో 2368 గృహాలను పూర్తి చేసి లబ్దిదారులకు స్వాధీనపర చడం జరిగిందని వివరించారు. అలాగే సీఆర్డీఏ పరిధిలో నవులూరు, నిడమర్రు, పెనుమాక, అనంతవరం, దొండ పాడు, తుళ్ళూరు, ఐనవోలు, మందడంలలో నిర్మించిన 5024 టిడ్కో గృహాలను లబ్దిదారులకు అందించడం జరిగిందని తెలిపారు. వెంగళాయపాలెం ఫేజ్-2లో ప్రోగ్రెస్‌లో ఉన్న 1392 గృహాలు అలాగే తెనాలిలోని పూలే కాలనీలోని 1008 గృహాల నిర్మాణపనులు పూర్తి చేయడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి లబ్దిదారులకు స్వాధీనపరచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిడ్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిడ్కో పర్యవేక్షణ ఇంజనీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాదరావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చౌక ధరలకే బియ్యం, కందిపప్పు

– సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్

**విశాలాంధ్ర-తెనాలి :** బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరలకు రైతుబజార్లలో సరుకులు లభ్యమౌతున్నాయని వినియోగదారులు వినియోగించుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్ అన్నారు. గురువారం పాత రత్నాటాకీస్ వద్ద గల రైతు బజార్లో బియ్యం కేజీ రూ.48, కందిపప్పు కేజీ రూ.160 చొప్పున అమ్మకాలు ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి తహసీల్దార్ శ్రీనివాస్, ఎయస్ఓ వాణి, గుంటూరు మూర్తి, రైతు బజార్ పర్యవేక్షకులు రామకృష్ణ ప్రభృతులు పాల్గొన్నారు.

## వైభవంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

– రథాన్ని లాగి యాత్రను ప్రారంభించిన మంత్రి లోకేశ్

**విశాలాంధ్ర-మంగళగిరి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంగళగిరిలో ఇస్కాన్ ఆధ్వర్యాన శ్రీ జగన్నాథుని రథయాత్ర వైభవంగా సాగింది. మంగళగిరి బస్టాండు వద్ద నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు తొలుత హారతి ఇచ్చిన లోకేష్ అనంతరం రథాన్ని లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జై జగన్నాథ్, హరేకృష్ణ, హరేరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. గురువారం మంగళగిరిలో నిర్వహించిన రథయాత్రలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అని అన్నారు. ప్రజల కష్టాలు తొలగి అందరూ సుఖశాంతులతో ఉండేలా ఆ జగన్నాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు.

## పాఠశాలను ఆర్జేడి ఆకస్మిక తనిఖీ

**విశాలాంధ్ర-ఫిరంగిపురం:** పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గుంటూరు ఆర్జేడి రామలింగేశ్వర రెడ్డి గురువారం ఫిరంగిపురం మండలంలో అకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రమైన ఫిరంగిపురం శాంతిపేటలో గల ఎంపీపీ యస్ పాఠశాలను ఆర్జేడి సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన పోషకా లతో కూడిన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్ధ్యాలను పరిశీలించి 3,4,5 తరగతుల వారికి బేస్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహించి సామార్థ్యాల వారిగా భోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల విద్యాశాఖాధికారులు షేక్. మహబూబ్ సుభానీ, సీహెచ్ రవికాంత్, ఎంఆర్సీ సిబ్బంది ఆర్జేడి వెంట పాల్గొన్నారు.

## పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**విశాలాంధ్ర-ప్రత్తిపాడు :** మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలు పట్టించుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించటంతో చిన్న కొండ్రుపాడు గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాసరావు(38) బుధవారం పురుగుమందు తాగగా స్థానికులు గమనించి కేఎంసీ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం చనిపోయినట్లు మృతుని భార్య శ్రీలక్ష్మీ ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు తెలిపారు.

## హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



**విశాలాంధ్ర-మంగళగిరి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికారి సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మోటారు వాహనాల సంబంధిత చట్టాలపై అవగాహన ర్యాలీ జరిగింది. గురువారం మంగళగిరి పట్టణంలోని స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి మోటారు వాహనాల సంబంధిత చట్టాలపై అవగాహన ర్యాలీ ప్రారంభమైంది. అక్కడ నుంచి స్టేషన్ రోడ్డు, గౌతమ్ బుద్ధ రోడ్, మెయిన్ బజార్ గుండా, అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారంలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజు, ప్రిన్సిపాల్ జూని యర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ బాబు, మోటార్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్ విజయసారథి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శృంగార పాటి బాల మురళీకృష్ణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్యారా లీగల్ వలంటరీలు, ప్యానల్ అడ్వకేట్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

**విశాలాంధ్ర-మంగళగిరి :** రైతు బజార్‌లో కందిపప్పు, బియ్యం సబ్సిడీపై అందిం చాలని ఉద్దేశంతో పౌరుషాల శాఖ ఆధ్వర్యంలో మంగళ గిరి రైతు బజార్‌లో గురు వారం ప్రత్యేక కౌంటర్‌ను టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య ప్రారంభించారు. కేజీ కందిపప్పు రూ.120లు, బియ్యం కేజీ రూ.48లు, రూ.49 లకు అందిస్తారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్ధార్ దుర్గారావు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి రమేష్‌లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జెండా ఆవిష్కరణ

**విశాలాంధ్ర-తెనాలి :** తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని డిపో చీఫ్ అడ్వైజర్ బి.సాంబశివరావు ఆవిష్కరించారు. జోనల్ చీఫ్‌వైస్ ప్రెసిడెంట్ పి.ఎల్లమందయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపనలో గతంలో ఎంతో మంది కార్మికులు నాయకులు నిరంతర కృషి చేశారని ఆ దృశ్యం మరువలేమని చెప్పారు. నేడు కార్మికులందరూ కలిసి తమ విద్యుత్త ధర్మాలను నిర్వహిస్తూ యూనియన్ అభివృద్ధికి నిర్విరామ కృషి చేయాలని చెప్పారు. డిపోచీఫ్ అడ్వైజర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ గతంలో నాయకలు యూనియన్ కోసం కార్మికుల కోసం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి సంస్థ ఈ స్థాయికి ఎదిగేందుకు కృషి చేశారని అలాంటి సంఘం వార్షికోత్స వం నిర్వహించడం అభినంద నీయమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరి విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, గౌరవ అధ్యక్షులు వీరయ్యబాబు, ముక్తేశ్వ రరావు, కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష కార్యదర్శులు బాబు, సుధాకర్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు డి.డి.యస్.రావు, జోషిబాబు, మహిళా నాయకులు పోలేరమ్మ, దేవి, భూలక్ష్మి, ప్రసన్న, ఫాతిమా, జ్యోతి, కమల కుమారి, గ్యారేజ్ నాయకులు షేక్ రబ్బాని, రాఘవయ్య పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు వృద్ధాప్య పించన్ ఇవ్వాలి

**విశాలాంధ్ర-తాడేపల్లి :** రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయీస్‌కు తెల్లరేషన్ కార్డులు ఇచ్చి, వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని కోరుతూ గురువారం ప్రజాదర్బార్‌లో ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం విద్య, ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. అర్జీపై లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి తప్పనిసరిగా మీకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, ఉపాధ్యక్షులు కె.కోటేశ్వరరావు, బీడీఆర్ రెడ్డి, గుంటూరు 1, 2 డిపోల రామచంద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

**విశాలాంధ్ర-మంగళగిరి:** ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం మంగళగిరి డిపో నందు వైభవంగా జరిగినది. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బి సాంబశివరావు, మంగళగిరి ఆర్టీసీ డిపో దగ్గర, గౌతమ బుద్ధ రోడ్డు వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బి సాంబశివరావు మాట్లాడుతూ ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్, యూనియన్ సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వేముల నాగేశ్వరరావు, వి మనోజ్ కుమార్, నాగేంద్రం, వీరయ్య, డిపో కమిటీ రీజినల్ బాధ్యులు, మహిళా నాయకురాలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర అధ్యయన శీలి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

– జన్మదిన వేడుకలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** నీతి, నిజాయితీకి ఆదర్శంగా నిలిచిన నిరంతర అధ్యయన శీలి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొని యాడారు. గుంటూరులోని లక్ష్మణరావు స్వగృహంలో 68వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి, పలువురు ప్రముఖులు లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాల కాలంలో విద్యార్థి ఉద్యమ నాయకునిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, జనవిజ్ఞాన వేదిక నేతగా, ఎమ్మెల్సీగా అవిరళ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు వి. కైలాస్ నాథ్, రామచంద్రరావు, రామారావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, అర్బన్ డిఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, ఏపీ రెసిడెన్షియల్ సంఘం నాయకులు పీవీ మల్లేశ్వర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు : కలెక్టర్

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలు చేయబడే పథకాలకు అర్హులైన లబ్దిదారులను గుర్తించి సదరు సంక్షేమ పథకాలు అర్హులందరికి అందెటట్లు అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వివిధ సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సాంఘీక సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, గురుకుల పాఠశాల, విభిన్నప్రతిభావంతులు సంక్షేమ శాఖల అధికారులతో సంబంధిత శాఖలలో చేపడుతున్న సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన రావు మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు అందిస్తున్న మెనూ రేట్లు పెంచాల్సి ఉందని, వారంలో అందించే ఆహారపదార్ధాల జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. బిల్డింగ్ రిపేర్స్‌కు బడ్జెట్ కేటాయించలేదన్నారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా 2013వ సంవత్సరంలో అంబేద్కర్ భవన్ మంజూరు అయిందని, నేటికి భవన నిర్మాణం పూర్తి కాలేదన్నారు.అదేవిధంగా ఆయా శాఖల అధికారులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ శాఖలలో ఏమైనా సమస్యలు ఉంటే నోట్ ద్వారా తన దృష్టికి తీసుకురావా లని, జిల్లా అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

## 16వ రోజు కొనసాగిన ప్రజాదర్బార్

**విశాలాంధ్ర-తాడేపల్లి:** సామాన్య ప్రజానీకం పడుతున్న కష్టాలు, వారి సమస్యల పరిష్కారం కోసం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహి స్తున్న ప్రజాదర్బార్ కు విశేష స్పందన లభిస్తోంది. ఉండవల్లి నివాసంలో 16వ రోజు ప్రజాదర్బార్‌కు మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలి వచ్చారు. యువనేతకు నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని స్వీకరించిన మంత్రి.. ఆయా సమస్యలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు పంపి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడికి వికలాంగ ధృవ పత్రం మంజూరు చేసి ఆదుకోవాలని విజయవాడ జక్కంపూడి కాలనీకి చెందిన కే.సన్యాసి విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్‌తో మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేయాలని ఏలూరు జిల్లా చిత్తపూరుకు చెందిన మామిళ్లపల్లి పరమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించిన మంత్రి నారా లోకేష్... సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇచ్చారు.

## వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటు : ఎమ్మెల్యే మాధవి

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** ప్రజారంజక పాలన సాగిస్తున్న ఎన్డీయే ప్రభుత్వం పై వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. స్థానిక చుట్టుగుంట సెంటర్ లోని రైతు బజార్లో సబ్సిడీపై కందిపప్పు, బియ్యం కేంద్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కందిపప్పు రూ.160లు, బియ్యం రూ.48లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత ఇసుక విషయంలో వైసీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రజల మీద మోపిన భారాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కోటి సులభతరం చేస్తున్నారని, రెట్టించిన సంక్షేమంతో ప్రభుత్వం పాలన మొదలు పెట్టి ప్రజల నుండి మన్ననలు పొందుతు న్నందున అక్కసుతోనే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇసుకను దోచుకొని, అనేక మంది భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలకు కారణమయిన వైసీపీ నేతలు విమర్శలు చేయటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు.

**నల్లచెరువులో ప్రజాసమస్యల తిష్ట :** స్థానిక 19వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తిష్టవేసాయని, కనీస మౌళిక సదుపాయాలయిన రోడ్లు, మంచినీరు, డ్రైనేజి సమస్యలను కూడా గత పాలకులు విస్మరించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేసారు. గురువారం నల్లచెరువులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ కార్యక్రమంలో రాళ్లబండి రామరాజు, తెలుకుట్ల హనుమాయమ్మ, పానకాల లక్ష్మణ్, రహీం, చంద్రగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

## మొండిగేటు అవుట్‌ఫాల్ డ్రైన్ సమస్యపై దృష్టి సారించండి

– జీఎంసీ, రైల్వే అధికారులతో ఎమ్మెల్యే మహ్మద్ నసీర్

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** సుదీర్ఘకాలం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న మొండిగేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే క్రాసింగ్‌కు వేగంగా చర్యలు తీసుకోవడానికి జీఎంసీతో పాటు రైల్వే అధికారులు కూడా మరింత దృష్టి సారించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక పాత గుంటూరు దగ్గరలోని మొండి గేటు రైల్వే ట్రాక్ వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ క్రాసింగ్ అంశంపై జీఎంసీ ఇంజీరింగ్, రైల్వే డివిజనల్ ఇంజనీర్లతో ఎమ్మెల్యే సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పాత గుంటూరు పరిధిలోని మొండి గేటు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ రైల్వే ట్రాక్ క్రాస్ వద్ద సుమారు 30 ఏళ్ల నుంచి సమస్యగా ఉందని, నగరంలో నుంచి 4 మీటర్ల అవుట్ ఫాల్ డ్రైన్ నుంచి వచ్చే మురుగు లేదా వర్షం నీరు ట్రాక్ కింద కేవలం 1.5 మాత్రమే ఉన్న వెంట్ నుంచి వెళ్లడం వలన నీరు పూర్తి స్థాయిలో బెయిల్ అవుట్ కాక పాత గుంటూరులోని పలు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. నగరపాలక సంస్థ నుంచి కూడా రైల్వే అధికారులు తగిన వివరాలతో లేఖలు రాయాలని, కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి కూడా తీసుకెళ్లతామని తెలిపారు. సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు, టైం లైన్ కార్యాచరణ సిద్ధం అయ్యేలా రైల్వే, జీఎంసీ అధికారులు చర్యలు తీసు కోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, రైల్వే డివిజనల్ ఇంజనీర్ సుదర్శనరెడ్డి, జీఎంసీ డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## 13న 'ఏపీ అభివృద్ధి కార్యాచరణ'పై చర్చా గోష్టి

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న గుంటూరులోని రామన్నపేట 1వ లైన్‌లో ఉన్న జనచైతన్య వేదిక హాలులో 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్యాచరణ'పై చర్చా గోష్టి జరగనుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించనున్నారని, డాక్టర్ పీవీ రమేష్ 35 సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వంలో, వివిధ దేశాలలో పని చేసి ఆర్థిక విషయాలలో అపారమైన అనుభవాలను గ్రహించారన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ చర్చాగోష్టిలో పౌర సంస్థలు, ప్రజా సంఘాల నేతలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాముకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాపు అభివృద్ధి పథకాలను పునరుద్ధరించండి

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014-2019 సంవత్సరంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కాపు, తెలగ, ఉపకులాల అభ్యున్నతికి ఎన్నో మంచి పథకాలను ప్రవేశ పెట్టిందని, మరలా ఆ పథకాలను వెంటనే అమలు పరిచి కాపు కుల అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వాలని కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తికి తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సంఘం సెక్రటరీ బాలిశెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కాపు భవనం నిర్మాణం త్వరలో మొదలు పెట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కాపు భావ నాలు తదితర కాపు అభివృద్ధి కార్యక్రమాల వలన ఎంతోమంది కాపు, ఉపకులాల వారు బాగా అభివృద్ధి చెందారని, అలాంటి తోడ్పాటును అందచేయాలని కోరారు. కోలా చలపతిరావు, రేపల్లె నవీన్, చెమిటికంటి కిరణ్,నరసింహారావు, పాల్గొన్నారు.

## 'ప్రపంచ జనాభా దినోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి 'ప్రపంచ జనాభా దినోత్సవం' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వివిధ కేటగిరీలలో గెలుపొందిన వారిని లక్కీ డిప్ ద్వారా కలెక్టర్ ఎంపిక చేశారు. పీపీఐయూసీడీ కేటగిరిలో ఎం.సంధ్యారాణి(రూ.5 వేలు), వ్యాసక్టమి కేటగిరీలో జె.రంజిత్ కుమార్(రూ.5 వేలు), తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతి 'అంతర' కేటగిరి క్రింద డాక్టర్ భారతి(రూ.5 వేలు) ఎంపిక కావడం జరిగింది. ఉత్తమ వాసెక్టామీ సర్జన్ క్రింద డాక్టర్ పి.రామారావు, జీజీహెచ్ గుంటూరు (రూ.7 వేలు), ఉత్తమ పీపీఐయూసీడీ సర్జన్ కింద డాక్టర్ మానస, డిహెచ్ తెనాలి(రూ.8వేలు) ఎంపిక కావడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డీపీఎంఓ పద్మజ, ఎస్ఓ ఏ.జయప్రసాద్, ఉమా జోస్ఫిన్ పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



**విశాలాంధ్ర-పొన్నూరు :** పొన్నూరులో ఏపీఎస్ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఆ యూనియన్ సీనియర్ కార్మికుడు, నాయకుడు ఎస్కే వలి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు గంట రాజేంద్ర కుమార్, దేవరకొండ శ్రీనివాస్, ఎస్కే రహీం సాహెబ్, ఆరేటి రామారావు తదితరులు విప్లవ చైతన్య గీతాలు ఆలపించారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ అధ్యక్షులు ఆర్‌జీ రాజు అధ్యక్షత వహించగా ఎంప్లాయిస్ యూనియన్ పొన్నూరు డిపో సెక్రటరీ ఏఏ బిగ్ మాట్లాడుతూ ఆర్టీసీలో 1952 సెప్టెంబర్ 11లో సయ్యద్ ఖాసిం, రాఘవేంద్ర దేశాయ్ నాయకత్వంలో యూనియన్‌ను స్థాపించడం జరిగిందని, ఆర్టీసీలో వారాంతపు సెలవు లేని రోజులలో పోరాడి వారాంతపు సెలవు సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కార్మికులు అనుభవిస్తున్న బస్ పాస్ 1953 సంవత్సరంలో సాధించారన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో కార్మికులు అనుభవిస్తున్న అలవెన్సులు, యూనిఫారం వగైరా యూనియన్ సాధించి పెట్టినవేనని అన్నారు. ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు మాట్లాడుతూ నిజాం నవాబు పరిపాలనలో రైల్వే, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ కలిసి ఉండేవని, 1950 నవంబర్ 1న రైల్వేల నుంచి ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ విడిపోయినదని చెప్పారు. మొదట ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు గంట రాజేంద్ర కుమార్, దేవరకొండ శ్రీనివాస్, ఎస్కే రహీం సాహెబ్, ఆరేటి రామారావు తదితరులు విప్లవ చైతన్య గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎల్ఎన్ బాబు, ట్రెజరర్ ఎస్కే ఖాసింబుడే, గ్యారేజీ కార్యదర్శి కేఎస్ రావు పాల్గొన్నారు.

## 50 శాతం ఇసుకను బిల్డర్స్‌కు కేటాయించండి

– కలెక్టర్‌ను కోరిన నరెడ్కో కాపిటల్ జోన్ నేతలు

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరుకు సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లలో ఒక రీచ్ నుంచి 50 శాతం ఇసుకను బిల్డర్స్‌కు కేటాయించాలని నరెడ్కో కాపిటల్ జోన్ నేతలు కలెక్టర్‌ను కోరారు. అలా చేస్తే దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీని కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో గురువారం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీలలో కూడా ఫైల్స్ ఆలస్యం అవుతున్నాయని తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తగిన నిర్ణయం తీసుకుంటామని, అలాగే మున్సిపాలిటీలలో ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని త్వరలో పరిష్కారం అవుతాయని చెప్పడం జరిగిందని నేతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రెసిడెంట్ పెరవలి నాగవంశి, సెక్రటరీ వి.శ్రీనాథ్, టి.అర్జున్ సాయి, వై.దుర్గాప్రసాద్, ఎన్.శ్రీనివాస్ కుమార్, ఎం.శ్రీనివాస్ బాబు, పి.సుధాకర్, వి.రాంబాబు, పీవీ మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన శాంతమూర్తి

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీను కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వ కంగా కలిశారు. చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ బ్రోచర్‌ను ఆమెకు అందజేశారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో తాము చేస్తున్న కృషిని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్ రాజలత ఉన్నారు.

## 'నీట్ లీకేజీకి-రీ టెస్ట్ సమాధానమా?'



**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** నీట్ యూజీ ప్రవేశ పరీక్షా పత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించటం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరి ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి తప్పించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎన్ మల్లీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'నీట్ లీకేజీకి-రీ టెస్ట్ సమాధానమా?' అనే అంశంపై గురువారం చర్చ జరిగింది. అయితే రెండు, మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినపుడు 23 లక్షల మందికి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పు చేయని వారికి శిక్షేనని అన్నారు. అయితే ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, మురళీకృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు గుంటూరు చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. పీఎం పోర్షన్ మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసీంకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

**దస్తావేజు పోయినది**

నా తండ్రి గారైన మట్టుకొయ్య నాగేశ్వరరావు గారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తుళ్ళూరు మండలం, అనంతవరం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన అనంతవరం గ్రామ తాలూకు సర్వే నెం:284, 285లలో యు 0-80 సెంట్లు భూమిని మంజూరు చేసి అందులకు ఋజువుగా నా తండ్రి గారి పేరున డి.కె పట్టాను యిచ్చియున్నారు. నా తండ్రి గారైన మట్టుకొయ్య నాగేశ్వరరావు గారు ది.25-04-2019వ తేదీన మరణించియున్నారు.వారు జీవించి యున్న కాలము నందు సదరు డి.కె పట్టా ఒరిజినల్ నాకు జాగ్రత్త చేయమని యిచ్చియున్నారు. అయితే 05-07-2024వ తేదీన సదరు పైన తెలిపిన డి.కె పట్టా ఒరిజినల్ మరియు మరికొన్ని యితర పత్రములను తీసుకొని అనంతవరం గ్రామము మా ఇంటి వద్ద నుండి తుళ్ళూరు గ్రామమునకు బండిపై వచ్చుచుండగా సదరు పైన తెలిపిన అస్సల్ డి.కె పట్టా ఒరిజినల్ మార్గమధ్యములో పోయినది. దాని గురించి యిప్పటి వరకు వాకబు చేయుచున్నాను. దానిని నేను ఎంత వెదికినను అది నాకు లభించలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది నెంబర్‌కి సంప్రదించగలరు: 97032 40448.

**దస్తావేజులు పోయినవి**

కె.కనకదుర్గ భవాని, ఇంటి నెం.32-24-2010, వార్డ్ నెం.7, 6వ లైను, కాకుమానువారి తోట, డొంక రోడ్డు, గుంటూరుకు చెందిన నేను ది. 10-06-2024వ తేదీన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.134/2002తో పాటు మరికొన్ని డాక్యుమెంట్లను తీసుకొని కాకుమానువారితోట లోని మా ఇంటి వద్ద నుండి అరండల్ పేట, 9వ లైనులోని జిరాక్స్ సెంటర్‌కు జిరాక్స్ తీయించుకొను నిమిత్తం వెళ్ళి చూసుకొనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 134/2002 మార్గమధ్యములో ఎక్కడో పడిపోయినది,ఎంతవెతికిననూ కనిపించలేదు. సదరు డాక్యుమెంటు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింద తెల్పిన అడ్రస్‌కు అందజేయవలెను లేదా ఈ క్రింద తెల్పిన సెల్ నెంబర్‌కు తెలియపరచగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

కె. కనకదుర్గా భవాని
ఇంటి నెం. 32-24-2010, వార్డ్ నెం.7
డొంకరోడ్డు, గుంటూరు - 522002.
సెల్: 7382330417

**బహిరంగ ప్రకటన**

నా క్లయింటు అయిన గుంటూరు టౌన్, కొరిటిపాడు గ్రామ కాపరస్తులు చేకూరి మల్లేశ్వరరావు గారి భార్య అనురాధ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు చేకూరి అనురాధ గారికి చెందిన ఒరిజినల్ విక్రయ దస్తావేజును అనగా ది.22-04-1993న డ.నెం.204/1994గా గుంటూరు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం నందు రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజును నల్లపాడులోని తన స్నేహితల వద్దకు చూపించడానికి తీసుకొని వెళ్ళి మరల ఇంటికి వచ్చు క్రమంలో నల్లపాడు సెంటర్‌లో సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది. కనుక ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేయగలరు. కనుక తెలియజేయడమైనది.

కేసానుపల్లి వెంకట శ్రీరామ్ సుబ్బారావు,
అడ్వకేట్, 6/4 అరండల్ పేట, గుంటూరు.

# విశాలాంధ్ర
## పల్నాడు జిల్లా

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-వినుకొండ : ఏపీ పీటీడీ (ఏపీఎస్ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయము నందు గురువారం డిపో అధ్యక్షులు డీజీ విన్సెంట్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జోన్ అసిస్టెంట్ సెక్రటరీ కే. హరిబాబు హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పలనాడు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్కే ఖాజా హాజరై మాట్లాడుతూ యూని యన్ బలోపేతానికి కృషిచేసిన రాష్ట్ర నాయకులు చేసిన సేవల గురించి వివరించారు. డిపో కార్య దర్శి సాంబశివరావు మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్ చేసిన 24 రోజుల సమ్మె, కారుణ్య నియామకాలు, పేస్కేల్, జీతభత్యాలు వార్షిక ఇంక్రిమెంట్లు మొదలగునవి ఉద్యో గులకు అవసర మైన కార్యక్రమములు నిర్వహించడంలో యూనియన్ క్రియాశీలకంగా ఉంటుం దని వివరిం చారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నాయకులు టీ.ఎస్‌రావు, గ్యారేజీ కార్యదర్శి గణపవరం శ్రీనివాసరావు, సీసీఎస్. డెలిగేట్ టీ. రాంబాబు, ఎస్‌కె.జానీ, ఎస్ కె.బాజీ, ఏ బ్రహ్మం, ఏ ఆంజనేయులు, అన్నపూర్ణ, టీ.సురేష్, ఎం.ఎం.వలీ, బి. పేరయ్య, కె ఎల్ నారా యణ, శివా నాయక్, ఎస్ ఎస్ ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం మాజీ ఎమ్మెల్యే గోపి రెడ్డి పర్యటన



విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో అన్నవరం గ్రామంలో గురువారం నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆ గ్రామంలో భుజం నొప్పితో బాధ పడుతూ సర్జరీ చేయించుకున్న మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓటమి పై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ గెల్లి చినకోటిరెడ్డి, వైసీపీ మండల నాయకులు పొనుగోటి వెంకట్రావు, నాని తదితరులు పాల్గొన్నారు.

## 88-శాతం సుమోటో క్యాస్ట్‌ల గుర్తింపు
## తహశీల్దార్ రజిని కుమారి

విశాలాంధ్ర-దుర్గి: ప్రభుత్వం నుంచిసుమోటో క్యాస్ట్‌ల జాబితా కార్యాలయానికి వచ్చినట్లు తహసీ ల్దార్ జి.రజని కుమారి తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ రెవిన్యూ అధికారులు (వీఆర్వోలు), సహాయ రెవిన్యూ అధికారులు(వీఆర్ఏ) జాబితా ప్రకారం గ్రామాల్లోకి వెళ్ళి లబ్ధిదారులను ఇళ్ళ వద్ద వారి ద్వారా కులము తెలుసుకుని నమోదు చేసుకునే పనిలో రెవిన్యూ సిబ్బంది నిమగ్నమయ్యారు. మండలానికి వచ్చిన 2219 మంది పేర్లకు గాను 2019 మందికి సంబంధించిన కులాలు గుర్తించగా 88 శాతం వచ్చిందని, గురువారం సాయంత్రం కల్లా నూరుశాతం పూర్తి అవుతుందని చెప్పారు. మరోవైపు కౌలుదారులను గుర్తించి వారికి సీసీఆర్సి కార్డులు అందించేందుకు సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా బాధ్యతగా పని చేస్తున్నట్లు ఆమె తెలిపారు. 1890కి గాను ఇప్పటికి 781 సీసీఆర్సి కార్డులను కౌలుదారులకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.

## ట్రిపుల్ ఐఐటీకి 19 మంది విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-శావల్యాపురం: రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశాలకు మండలంలోని మూడు జడ్పీ పాఠశాలలకు చెందిన 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో మద్దిగుంట సాంబశివరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 10వతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన పొత్తూరి భువన సాయి సుభాష్, దూళ్ళ సంతోష్, అద్దంకి పవన్ కుమార్, మర్రి యశోదర్, గోరంట్ల యామిని, బొల్లా అనుపమ, నన్నేబోయిన సాయి త్రిష, గాలం యశ్వంత్ బాజీ, బొల్లా వర్షిత, సగినాల వైష్ణవి, పోట్లూరు జడ్పీ పాఠశాలకు చెందిన చల్లా నంద కిషోర్, గడిపూడి వెంకట దినేష్, గడిపూడి ఛత్రపతి మనోజ్, గొట్టిపాటి రథీశ్వర్, షేక్ మస్తాన్ వలి, దావులూరి. శ్రీలక్ష్మి శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన కన్నెదారి వెంకట కళ్యాణ్, చవల చంద్రశేఖర్, గొల్లపూడి అబినయ వర్దన్‌లు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు పల్లపాటి శ్రీనివాసరావు, గడిపూడి రామారావు, ముట్లూరి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు షేక్ మాబు సుబాని, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, జడ్పీటీసీ పారా హైమావతి, గ్రామస్తులు బొల్లా పేరయ్య, గడిపూడి వెంకట్రాయుడు, తదితరులు అభినందించారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ



విశాలాంధ్ర-గురజాల/దాచేపల్లి: దాచేపల్లి పట్టణంలోని ఫాతిమా మాత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల పట్టణ సీఐ బాలకృష్ణ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్నాటి వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దివ్యాంగులను, మానసిక స్థితి సరిగా లేనివారిని ప్రతి ఒక్కరు గౌరవించాలని వారికి మనము తగిన విధంగా సహాయక సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని తెలిపారు. ప్రభుత్వం కూడా వారికి పింఛన్ పెంచి వారి అవసరాలకు ఆర్థిక చేయూతనందించడం కూడా శుభ పరిణామం అని డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉల్లంగుల వెంకటేశ్వరరావు, మక్కెన అమర కృష్ణ, చెన్ను కాశిరెడ్డి, మక్కేన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'ప్రపంచ జనాభా దినోత్సవం'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిబేట్ నిర్వహించారు. ముఖ్య అతిధులు ప్రముఖ వైద్యులు డాక్టర్ శనక్కాయల ఉదయ్ శంకర్, మాజీ ప్రిన్సిపల్ పి.సుధాకర్ ఈ డిబేట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ (నగదు)బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ఆనంద్ బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, సెక్రటరీ కె.సతీష్, వృత్తి విద్యా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఎన్.శరత్, కోఆర్డినేటర్ నిర్వహించారు.

# ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం: ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రతి ఇంటికీ తాగునీరిచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట మండలంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా యలమందలో 39.80 లక్షలు, కోటప్పకొండలో 3.93 కోట్లతో చేపడుతున్న పైప్‌లైన్ పనులకు గురువారం డాక్టర్ అరవింద బాబు శంకుస్థాపన చేశారు. కోటప్పకొండ జలజీవన్ మిషన్ ద్వారా యక్కలవారి పాలెం, కొండకావూరు, కట్టుబడివారిపాలెం, మోపీదేవి వారిపాలెం గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జగన్ రెడ్డి ఎన్నికల్లో మాటిచ్చి మోసం చేయడం మాత్రమే తెలుసు. కానీ, కూటమి ప్రభుత్వానికి గానీ, చంద్రబాబు నాయుడుకు గానీ ఇచ్చిన హామీని అమలు చేయడం మాత్రమే తెలుసునన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి ఇంటికీ మంచి నీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్న హామీలో భాగంగానే ఈ రోజు జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కులాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు బందారుపల్లి విశ్వేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడియాల రమేష్‌బాబు, ఎర్రమాసు ఆంజనేయులు, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కడియాల తాండవ కృష్ణ, శివ నాగు, సైదారావు, శివ లక్ష్మయ్య, కుమారి, రాష్ట్ర గోల్డ్ బులియన్ మార్చట్ అధ్యక్షుడు కపిలవాయ విజయ్ కుమార్,స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గార్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కోటప్పకొండ ప్రైమరీ హెల్త్‌కేర్‌సెంటర్ ఆకస్మికంగా తనిఖీ ప్రభుత్వాసు పత్రులకు వచ్చేదంతా పేదలేనని, వారికి మెరు గైన వైద్యం అందించే విషయంలో అధికారులు, డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోనని నరసరావు పేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు అన్నారు. కోటప్ప కొండలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ఆకస్మికంగా తనఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు.

# డయేరియా బాధితులను మంత్రి నారాయణ పరామర్శ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ శివారులోని లెనిన్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో డయేరియా బాధితులను గురువారం మంత్రి నారాయణ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యం గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. డయేరియా ప్రబలిన వీధులను మంత్రి పరిశీలించి పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న కాలువలను కంప చెట్లు ఉండటంచూసి ఆయన అధికారుల పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్అండ్‌బి బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 80 డయేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం 38 కేసులు వివిధ హాస్పటల్లో నమోదైనట్లు, అన్ని కేసులు కూడా స్థిరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. రెండు కేసులు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్లో చనిపోయినట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లెనిన్ నగర్ మారుతి నగర్ చుట్టూ16 కిలో మీటర్ల మేర పైపులైన్, 7పవర్ బోర్స్, 36హ్యాండ్ బోర్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఏడు పవర్ బోర్లలో రెండిట్లో పాజిటివ్ రిజల్ట్ వచ్చిందన్నారు. వీనిలో నైట్రేట్ ఉన్నట్లు తెలిపారు. దీంతో బోర్లు అన్నింటిని ఆపివేసినట్లు తెలిపారు. గత నెల 29వ తేదీన డయేరియాను గుర్తించినట్లు తెలిపారు. కృష్ణానది నీటిని తీసుకుని వచ్చే ప్రధాన పైప్లైన్‌కు మరమ్మత్తులు జరుగుతుండటం వలన ఆపివేయడం జరిగిందన్నారు. ఐదు రోజులు పాటు కనీసం ఐదు రోజుల సమయం పడుతుందని అప్పటివరకు కాచిన నీటిని తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ రెండు ప్రాంతాల్లో కాలువలలో పూర్తిగా మురుగును తొలగించాలని, నీరు పారే విధంగా చేయాలన్నారు. ఖాళీ స్థలాలలో ఉన్నటు వంటి చెట్లను కూడా పూర్తిగా తొలగించి వేయాలని దీనికి సంబంధించిన ఎస్టిమేట్లు తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెండు రోజుల్లో తిరిగి ఇక్కడికి వస్తానని అప్పటిలోగా శుభ్రం చేయాల న్నారు. కాలువలను శుభ్రపరచాలని, చెట్లు తొలగించాలన్నారు. పైప్ లైన్లకు లీకులు లేకుండా కాలువల్లో నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడం మూలంగా ఈ నెల 30వ తేదీన లోపు టైం అయిపోయిం దన్నారు. అదేవిధంగా 15వ ఫైనాన్స్ నిధులు మార్చి సెప్టెంబర్స్‌కు బిల్లులు వేస్తే రూ.11400 కోట్లు కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం మూలంగా అవి కూడా ఆగిపోయాయన్నారు. ప్రజలు కట్టిన టాక్సులు రూ. 3500 కోట్లు కూడా దారి మళ్ళించారన్నారు. ఏసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు నుండి నిధుల మంజూరు కొరకుకు కేంద్ర ప్రభుత్వానికి కోరడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థనుగా పూర్తిగా నిర్వీర్యము చేసిందని ఆయన ఆరోపించారు.పట్టణంలో ఆగిపోయిన మున్సిపల్ భవనానికి రెండు కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిం దని గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నిధులు విడుదల కాలేదని త్వరలోనే ఆ యొక్క నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు.

## తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు



విశాలాంధ్ర-పొన్నూరు : నిత్యావసరాల ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్‌లో తక్కువ ధరలకు అందించే నాణ్యమైన స్టీమ్ బియ్యం, దేశవాళీ కందిపప్పు అందించే స్టాల్‌ను గురువారం స్థానిక తహశీల్దార్ సూర్యనారాయణ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోరి ధరలను స్థిరీకరించేందుకు నాణ్యమైన నిత్య వసరాలను తక్కువ ధరలకు అందించే నిమిత్తం రైతు బజార్‌లో స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. స్టీమ్ బియ్యాన్ని కేజీ రూ.49లకు, సాధారణ బియ్యాన్ని కేజీ రూ.48లకు, దేశవాళీ కందిపప్పును కేజీ రూ.160లకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బీవీ చౌదరి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ పట్టభద్రులు సమాజ సేవ చేయాలి



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతిరోడ్డులో ఉన్న హిందూ ఫార్మసీ కళాశాలలోని బీ. ఫార్మసీ చివరి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సభ ఘనంగా ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వీ నాగభూషణం గురువారం పేర్కొన్నారు. వీడ్కోలు సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఫార్మశి పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు సమాజ సేవ చేయాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బి.ఫార్మశి విద్యార్థులు ఎం.ఫార్మశి చదివితే ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. సీనియర్ విద్యార్థులకు, జూనియర్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి జూపూడి రంగరాజు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, బీ.ఫార్మశి అధ్యాపకులు ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్‌బాబు, బి.ఫార్మశి విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవతా చైర్మన్‌కు అభినందనలు



విశాలాంధ్ర-తెనాలి : తెనాలి మానవతా సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన అభ్యుదయ వాది, ఓంకార్ గ్రాఫిక్స్ అధినేత కటకం వెంకట ప్రసాద్‌ను గురువారం అభిమానులు అభినందించారు. దుగ్గిరాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, తెనాలి కార్యవర్గ సభ్యులు జి.రవికుమార్, ఉపాధ్యక్షులు దీపాల శ్రీనివాసరావు, సభ్యులు దుర్గా శివరామప్రసాద్, బాషీద్‌లు పూలమాలలతో సత్కరించారు. బాలచంద్రమౌళి మాట్లాడుతూ వెంకటప్రసాద్ సంస్థ ఛైర్మన్ అయిన సందర్భంగా పట్టణ, పరిసరప్రాంతాల్లో పేదప్రజలకు అండదండలుగా ఉండి వారికి నిరంతరం సేవలందించాలని ఆకాంక్షించారు. నిస్వార్థ సేవకు ప్రసాద్ ప్రముఖులని అన్నారు.

## కనకదుర్గమ్మకు యర్రబాలెం భక్తుల ఆషాడం సారె



విశాలాంధ్ర-మంగళగిరి : ఇంద్రకీలాద్రిపై కొలువు దీరిన కనకదుర్గమ్మకు యర్రబాలెం భక్తులు గురువారం సారె సమర్పించారు. దుర్గా భవానీ భక్త బృందం ఆధ్వర్యంలో మహిళలు విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకుని అనంతరం తమ వెంట తీసుకు వచ్చిన పూలు, పండ్లు, సారె, గాజులు సమర్పించారు.

**నారా లోకేష్‌ను కలిసిన దుర్గా భవానీ మహిళా భక్త బృందం సభ్యులు:** కనకదుర్గమ్మకు ఆషాడం సారె ఇచ్చేందుకు బయలుదేరిన యర్రబాలెం దుర్గా భవానీ మహిళా భక్త బృందం సభ్యులు మార్గమధ్యలోని ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దుర్గా భవానీ మహిళా భక్త బృందం సభ్యులు ఆకుల జయసత్య, ఆకుల ఉమామహేశ్వరరావు, నాయుడు నాగేశ్వరమ్మ తదితరులు నారా లోకేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : భవిష్యత్తులో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నా యని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్(రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్) విభాగంలో 'రోబోకప్లర్స్ సెమి-హ్యూమనాయిడ్ రోబోట్ మ్యానుఫాక్చరింగ్ హబ్'ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రవీణ్ మల్లా మాట్లా డుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేం దుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచు కుని ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా మల్టీడిసిప్లనరీ నాలెడ్జ్ అనుభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూ షణ్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిప తులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'స్టాప్ డయేరియా'పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండలం నడింపాలెం పంచాయతీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'స్టాప్ డయేరియా' అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ అవగాహనా సదస్సులో జల్ జీవన్ మిషన్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు డయేరియా వ్యాధి లక్షణాలు ఏమిటి, వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, డయేరియా రాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలియజేశారు. తదుపరి గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఐఈసీ కోఆర్డినేటర్ షఫీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన చేయ కుండా మరుగుదొడ్ల వాడకం, అన్నం తినడానికి ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడగటం గూర్చి అవగాహన కల్పించారు. సమావేశం అనంతరం విద్యార్థుల చేత గ్రామ ంలో డయేరియా నివా రణ నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారిచే గ్రామ మెయిన్ రోడ్డులో వాటర్ టెస్టింగ్ నిర్వహించి అందలి వివరా లను తెలియజేశారు. ఈ డయేరియా నివారణ అవగాహన కార్యక్రమానికి నడింపాలెం పంచాయతీ సర్పంచ్ పాలేపు కుమారి, జల్ జీవన్ మిషన్ కోఆర్డినేటర్ తేజ్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్టుగా యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్‌కు సన్మానం

విశాలాంధ్ర- వినుకొండ : వినుకొండ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినుకొండ విశాలాంధ్ర విలేకరి యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన సన్మానం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూని యన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ జెండాను ఆవిష్కరించి ఘనంగా వేడుకలు నిర్వహిం చారు. అలాగే విశాలాంధ్ర 72వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా జూన్ 22వ తేదీన రాష్ట్ర వ్యాప్త విశాలాంధ్ర ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికై విశాలాంధ్ర విజ్ఞానసమితి సీపీఐ రాష్ట్ర నాయకత్వ ంచే ఘనంగా సన్మానింపబడ్డ యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్‌ను వినుకొండ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఖజా డిపోఅధ్యక్షులు విన్సెంట్ కార్యదర్శి పి. సాంబ శివరావు మాట్లాడుతూ యార్లగడ్డ ఆజాద్ కుటుంబం గత 60 ఏళ్లుగా భారత కమ్యూనిస్టు పార్టీ కుటుంబంగా ఉంటూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు ఎంతో అండగా ఉండేవారన్నారు. అలాగే ఆజాద్ 25 ఏళ్లుగా విశాలాంధ్ర విలేకరిగా పార్టీకి సేవలందిస్తూ ప్రజా సమస్యలపై వార్తలు ద్వారా సమస్యలు పరిష్కరిస్తూ, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక వర్గానికి ఎంతో చేదోదువాదోడుగా విశాలాంధ్ర ద్వారా తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అలాగే గత 30 ఏళ్లుగా ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చారిత్రత్మాక ఉద్యమాలకు పోరాటాలకు అజాద్ విశాలాంధ్ర ద్వారా ఎన్నో సేవలందించారన్నారు. అలాగే డిపోలో ప్రయాణికుల సమస్యలపై బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై విశాలాంధ్ర వార్తలు ద్వారా ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలియపరుస్తూ ఆ సమస్యలు పరిష్కరించే దిశగా కృషిచేసిన విశాలాంధ్ర సేవలు కొనియాడారు. అలాగే ఆజాద్ ఆర్టీసీ కార్మికుల్లో ఎంతో గుర్తింపు తో పాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు కూడా గుర్తింపు తెచ్చు కోవటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని, రాష్ట్రస్థాయిలో విశాలాంధ్ర ఉత్తమ జర్నలిస్టుగా అజాద్‌ను విశాలాంధ్ర యాజమాన్యం గుర్తించడం అభినందనీయమన్నారు. అలాగే ఆర్టీసీ కార్మికుల సమస్యలపై జరిగే ఉద్యమాలకు విశాలాంధ్ర ఆజాద్ తమకు పూర్తిస్థాయిలో సహకరిస్తారని ఆకాంక్షించారు. ఈ సన్మాన సభలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికులు గ్యారేజ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బియ్యం, కందిపప్పు ధరల నియంత్రణకు చర్యలు



విశాలాంధ్ర-నరసరావుపేట: రోజురోజుకు పెరిగిపోతున్న బియ్యం, కందిపప్పు ధరలను నియంత్రించేందుకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో పౌరసరఫల అధికారులు సమాయత్తమయ్యారు. పల్నాడు జిల్లాలోని అన్ని మున్సిపల్ పట్టణాల్లో ఏర్పాటు చేసి బియ్యం, కంది పప్పును తక్కువ ధరకు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు, వ్యాపారస్తులతో జిల్లా కలెక్టర్ గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి వ్యాపారస్తులు తమ పరిధిలో ప్రభుత్వం నిర్ణించిన ధర మేరకు బియ్యం కందిపప్పు అమ్మకాలు నిర్వహించాలని సూచించారు. సంబంధిత మిల్లులు, వ్యాపార షాపుల వద్ద ధరలు ముద్రించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఘనంగా పాస్టర్ యేసురత్నంకు సన్మానం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి సంఘంలో ఐదు సంవత్సరాలు పని చేసి బదిలీపై వెళ్తున్న పాస్టర్ రెవరెండ్ పేరుపోగు యేసురత్నం, నూతన పాస్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానంను గురువారం గ్రామ నాయకులు, పెద్దలు, సంఘస్తులు, మహిళలు గ్లోరీ ఫెలోషిప్ పాస్టర్స్ బంధువులు ఆత్మీయులు నూతన వస్త్రాలు బహుకరించి, పూలమాలలు, బొకేలు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. గ్రామ నాయకులు, పెద్దలు లింగా బ్రహ్మయ్య, ఏసూరి సాయి శంకర్, లింగా సాంబయ్య తోటకూర శ్రీను, నేలవల్లి సుబ్బారావు మాట్లాడుతూ ముటుకూరు ఏఎల్‌సి సంఘంలో 5 సంవత్సరాలు సేవ చేసి మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి, ప్రజలు మన్ననలు పొందిన దైవ సేవకులు పేరుపోగు యేసురత్నం పాస్టర్ అని అన్నారు. ఏఈఎల్‌సి చర్చి ఆల్టర్నేట్ డెలిగేట్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ ముటుకూరు గ్రామంలో ఏఈఎల్‌సి పాస్టర్‌గా రెవరెండ్ పేరుపోగు యేసురత్నం చేసిన సేవా పరిచర్య, వారి సేవలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ మాచర్ల జాన్ మోజేష్, పాస్టర్ రెవరెండ్ రమేష్, పాస్టర్ రెవరెండ్ పులిమెల ఏసుదానం, చర్చి డెలిగేట్స్ మాచర్ల చిన్నపేరయ్య, పీసీసీ మెంబర్స్ మాచర్ల చిన్న రోశయ్య, మాచర్ల యోహాను, పులిమెల వెంకయ్య, పులిమెల అన్నారావు, కుక్కమూడీ కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

## మాతృ వందన యోజన పథకం

విశాలాంధ్ర-వినుకొండ : మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వినుకొండ పట్టణంలోని బి సెక్టార్ నందు కొత్తపేట సచివాలయం పరిధిలో మహిళలకు మెటర్నటీ బెనిఫిట్స్ గురించి ఐసీడీ ఎస్ సూపర్వైజర్ కే శ్రీలత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకాలలో గర్భిణీ స్త్రీలకు ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం చాలా ముఖ్యమైనది లక్షల మంది గర్భిణీలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. మొదటిగా గర్భవతి అయిన ప్రతి మహిళకు 5000 రూపాయలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందు తున్నారు. ప్రతి గర్భవతి ఆశా కార్యకర్త ద్వారా ఈ పథకానికి పేరు నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఏఎన్ఎం పరమేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ శివారు ఆదర్శనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు. మృతుని వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం కంపచెట్లలో ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం వద్ద పురుగుమందు డబ్బా, మద్యం బాటిల్ ఉన్నట్లు నోటి నుండి నురగ వచ్చి మృతి చెందినట్లుగా స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కారంపూడిలో రెస్టారెంట్ ధ్వంసం

విశాలాంధ్ర-కారంపూడి: పట్టణంలోని మదీనా రెస్టారెంట్‌ను మరో రెస్టారెంట్ యజమాని కుమారుడు ధ్వంసం చేసిన ఘటన జరిగింది. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆళహరి శ్రీనివాసరావు, ఎస్ఐ కె అమీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి సమయంలో నీలిమ రెస్టారెంట్ యజమాని కుమారుడు, అతని ఇద్దరు వర్కర్లు మదీనా రెస్టారెంట్‌కు వెళ్లి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. రెస్టారెంట్ ముందు ఉన్న బడ్డీబంకులో షార్ట్‌సర్క్యూట్ వలన కొంత ఫర్నీచర్ ధ్వంసమైందని రెస్టారెంట్ యజమాని ఫిర్యాదు చేశారన్నారు. నిందితులను విచారించగా నీలిమ రెస్టారెంట్ కన్నా మదీనా రెస్టారెంట్ వ్యాపారం బాగా జరుగుతుందన్న అక్కసుతో రెస్టారెంట్‌ను ధ్వంసం చేసినట్లు నిందితుడు నీలిమ రెస్టారెంట్ యజమాని కుమారుడు విచారణలో తెలిపారన్నారు. ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.

## విద్యార్థికి అభినందన

విశాలాంధ్ర-విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నీలం అజయ్ కుమార్ నూజివీడు క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటీ సీటు సాధించడంతో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం, ఉపాధ్యాయులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి హెచ్.ఎం. యు.లక్ష్మి మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 571 మార్కులు సాధించిన నీలం అజయ్ కుమార్‌కు నూజివీడు క్యాంపస్‌లో ట్రిపుల్ సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అజయ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సరీ యాజమాన్యం లైసెన్స్ తప్పనిసరి



విశాలాంధ్ర-పెదకూరపాడు: మిరప విత్తనాల సాగుపైనర్సరీ యాజమాన్యం లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్సు లేకుండా నర్సరీ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ అధికారి శ్రీనిత్య అన్నారు. మండల పరిధిలోని పరస గ్రామంలో నర్సరీ యాజమానులతో విద్యానశాఖ అధికారి మాట్లాడుతూ నర్సరీలో కలుపు, గడ్డి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉద్యాన శాఖ అధికారులతో నర్సరీ పై అవగాహన సదస్సు నిర్వహించి, సూచనలు సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి



విశాలాంధ్ర-రెంటచింతల: నూతనంగా మార్పు చేసిన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గిఉండాలని ఐసీడీఎస్ మండల సూపర్వైజర్ శ్రీదేవి కోరారు. గురువారం కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన మిషన్ శక్తి భారతీయ న్యాయ సంహిత కార్యక్రమ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. లైంగిక నేరాలు, స్త్రీలపై దాడులు, సామూహిక అత్యాచారాలు, వరకట్న భేదింపులు, వివాహానికి సంబంధించిన నేరాలపై బాలికలకు అవగాహన కల్గించారు. సదస్సులో డీసీపీ కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల రాజకుమారి పలువురు ఉపాధ్యాయి నులు పాల్గొన్నారు.